క్లుప్తంగా

ఘనంగా బంగారమ్మ ఆలయ ప్రారంభోత్సవం



అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెం లో నూతనంగా నిర్మించిన బంగారమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆలయం లో బంగారమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసి, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భం గా అన్నదానం నిర్వహించారు.

గ్రామకంఠంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అప్పన్న, ఎస్సీలు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురంలో గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సాగి కృష్ణ మూర్తిరాజు గ్రామ కంఠాన్ని ఆక్రమించి షాపింగ్ కాంపెక్సు, ఇల్లు నిర్మిస్తున్నారని పంచాయతీ వార్డు మెంబర్ దెందేటి అప్పన్న, పలువురు ఎస్సీలు తెలిపారు. ఈ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు ఆనంద్‌కుమార్‌కు వీరు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ అండదండలు చూసుకుని అతని సోదరులు సాగి సత్య నారాయణరాజు, సాంబమూర్తిరాజు ఇష్టానుసారం ఇళ్లు నిర్మిస్తున్నారని, ఈ విషయమై వీఆర్వోకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పారిశుధ్య నిర్వహణ అధ్వానం

- జోన్–2 పీజీఆర్ఎస్‌లో జెడ్సీకి పలువురి ఫిర్యాదు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని పలువురు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జోనల్ కమిషనర్ సింహాచలం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

- జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెం గాయత్రినగర్ 9వ బ్లాకు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రపరచాలని నివాసితులు వినతిపత్రం సమర్పించారు.
- జేఎన్ఎన్‌యూఆర్ఎం పీపీ–2 కాలనీలో మౌలిక సదుపాయాలు లేవని, పారిశుధ్య పనులు కూడా సక్రమంగా చేపట్టడం లేదని ఆయా కాలనీవాసులు తెలియజేశారు.
- షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్‌లో 81సెంట్లు పార్కు స్థలంలో అక్రమంగా వేసిన షెడ్‌లు తొలగించాలని కాలనీవాసులు జెడ్సీకి వినతి పత్రం సమర్పించారు. జీవీఎంసీ, వుడా ఉన్నతాధికారులకు చెప్పినా స్థానిక అధికారులు



జెడ్సీ సింహాచలానికి సమస్య వివరిస్తున్న బింద్రానగర్ కాలనీ వాసులు

నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని సింహాచలం ఫిర్యాదుదారులకు తెలిపారు.

వినతుల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే

భీమునిపట్నం: ప్రజల నుంచి వచ్చే వినతులను సత్వరం పరిష్కరించడానికి చర్యలను తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఇక్కడ మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీవో సంగీత్ మాథూర్,



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దారు పైల రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- **తగరపువలస:** 3వ వార్డులో సమస్యలపై రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.ఎస్.ఆర్ కృష్ణారావు పీజీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే గంటాకు వినతి పత్రం అందించారు.

జోన్–1కు 5 వినతులు

భీమునిపట్నం: జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ప్రేమప్రసన్న వాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అయిదు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి, యూసీడీ రెండు వినతులు వచ్చాయి.

కమిషనర్ దృష్టికి జ్యూట్‌మిల్ ఆస్తిపన్ను బకాయిలు

తగరపువలస: జీవీఎంసీ పరిధిలో చిట్టివలస జ్యూట్‌మిల్లుకు సంబంధించి 83 అసెస్‌మెంట్లకు గాను రూ.26 కోట్ల ఆస్తిపన్ను బకాయి ఉందని, వాటి వసూళ్లపై దృష్టి సారించాలని మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్ జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ఆయన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సురేష్ మాట్లాడుతూ ఆస్తిపన్ను బకాయిలు ఉండగానే స్థలాలు విక్రయించుకోవడానికి, లే అవుట్లు వేసుకోవడానికి ఎన్‌వోసీలు ఇస్తున్నారన్నారు. మళ్లీ అవే స్థలాలకు వీఎల్టీలు వేస్తున్నారన్నారు. చేతివాటానికి అలవాటు పడ్డ జీవీఎంసీ రెవెన్యూ అధికారుల నిర్ల



కమిషనర్ సంపత్‌కుమార్‌తో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ సురేష్

క్ష్యమే మిల్లు బకాయిలు పేరుకుపోవడానికి కారణమైందని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వ ఖజానాకు రావలసిన పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద బాధితులకు రూ.50వేల విరాళం



ఎమ్మెల్యేకు డీడీ అందిస్తున్న సంఘం ప్రతినిధులు

మధురవాడ: విజయవాడ వరద బాధితులకు మధురవాడ పౌర సంక్షేమ సంఘం రూ.50వేలు అందించింది. సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును నగరంలో కలిసిన విరాళాన్ని డీడీ రూపంలో అందజేశారు. వారు మాట్లాడుతూ సభ్యులంతా కలసి ఈ మొత్తాన్ని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు శ్రీపాద వెంకటరమణ, జగన్ మోహన్ చౌదరి, బాబ్జీ, ఆశాస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

తగరపువలస: చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలకు ఆనందపురం మండలం శిర్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 19న నిర్వహించిన ఎంపిక పోటీలలో పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినులు పోతల వాగ్దేవి, రేవతి ఉమ్మడి జిల్లా తరపున ఎంపికయ్యారు. అలాగే, వాగ్దేవి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు కూడా అర్హత సాధించింది. నవంబర్ 2 నుంచి 4 వరకు అనకాపల్లి జిల్లాలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఎంపికైన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయిని జి.శారద,



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

పీడీ సత్యం, స్కూల్ కమిటీ చైర్మన్ కోరాడ గౌరి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్ శిర్ల అప్పలనాయుడు, ఎంపీటీసీ బోని పార్వతి తదితరులు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–3 ఈఈ (ఆపరేషన్స్) పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా పాలవలస, తర్లువాడ పంచాయతీల పరిధిలోని గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలియజేశారు.

అమరవీరుల త్యాగాలే స్ఫూర్తి

పీఎం పాలెం: అమరవీరుల త్యాగం అజరామరమని 16 వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరో వార్డులోని ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అమర వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్క చేయని వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని పోలీసు అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు, జీవీఎంసీ జోన్–2 జెడ్సీ పి. సింహాచలం, బాబా ఇంజినీరింగ్



పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న మురళీకృష్ణ

కాలేజీ ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ, స్థానిక అసిస్టెంట్ కమాండెంట్ జి. ఇలియసాగర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

పద్మనాభం: మండల పరిధిలోని 25 లే ఔట్లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి డి.సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీ ఇళ్ల నిర్మాణంపై లేఅవుట్ ప్రత్యేక అధికారులు, సచివాలయ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఇళ్ల నిర్మాణాన్ని మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. లేదంటే ఇళ్లు రద్దు



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సునీత

చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆర్. పద్మజ పాల్గొన్నారు.

అత్తమామల నుంచి రక్షణ కల్పించండి

- కలెక్టర్‌ను ఆశ్రయించిన మహిళ

మహారాణిపేట: అత్తమామలు, కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఆనందపురానికి చెందిన సీహెచ్ రమణమ్మ కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌ను ఆశ్రయించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రమణమ్మ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 30న తన భర్త రాంబాబు రోడ్డు ప్రమాదంలో మరణించారని, తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని తెలిపారు. అత్త,మామలు, ఇతర కుటుంబ సభ్యులు తనను, తన పిల్లలను వేధిస్తున్నారని.. మరిది, మామగారు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను, తన పిల్లలను ఇంట్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని, గేట్లకు తాళం వేసి ఇబ్బందికి గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను ఇబ్బంది పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమెకు పలువురు మహిళలు అండగా నిలిచారు.

అదృశ్యమైన చిన్నారి నానమ్మ ఇంట్లో ప్రత్యక్షం

కొమ్మాది: రుషికొండలో అదృశ్యమైన చిన్నారి వలందపేటలోని నాన్నమ్మ ఇంట్లో ప్రత్యక్షమైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో కొండా మాధవి, కుమార్తె ఝాన్సీ (8)తో కలసి నివాసం ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం ఝాన్సీ తండ్రి మృతి చెందారు. ఝాన్సీ కొన్ని నెలలుగా తగరపువలస వలందపేటలో ఉంటున్న నాన్నమ్మ దగ్గర ఉంటానని మారాం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధ రాత్రి ఝాన్సీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి ఒంటిగంట సమయంలో ఝాన్సీ తల్లి మాధవి లేచి చూడగా పాప కనిపించకపోవడంతో వెంటనే 112 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఇద్దరు యువకులు ఝాన్సీని వలందపేటలో తమ నాన్నమ్మ ఇంట్లో అప్పగించినట్లు సమాచారం అందింది. ఆదివారం అర్ధరాత్రి వలందపేటకు వెళ్లేందుకు రుషికొండ జంక్షన్‌కు చేరుకున్న పాపను స్విగ్గీలో విధులు ముగించుకుని వస్తున్న ఇద్దరు యువకులు గమనించి, వివరాలు తెలుసుకుని అక్కడికి చేర్చారని తెలిసింది.

సామాన్యులపై ధరల భారం

మధురవాడ: నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులపై పిడుగులా పడుతున్నాయని, వాటిని అదుపు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. ధరల పెంపుపై సీపీఐ చేపడుతున్న ప్రచారోద్యమంలో భాగంగా 8వ వార్డు పాత మధురవాడ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా నాయకుడు టి.సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.